
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 41.8 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం సాయంత్రానికి 41.8 టీఎంసీల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 15,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,120
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,718
3 శాతం జీఎస్టీతో	రూ.6,920
నవర (8గ్రా)	రూ.55,360

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0 /26.7

జిల్లాలో వాతావరణం శుక్రవారం మబ్బులతో ఉండి చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 57 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా పొన్నవోలు



నెల్లూరు(బారకాసు): ప్రముఖ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది.

అనుబంధ విభాగాల్లో ఇద్దరికి చోటు



ప్రసన్న



షాకీర్‌బాబా

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. పార్టీ జంగం విభాగ రాష్ట్ర అధ్యక్షురాలిగా వావిలేటి ప్రసన్న, పార్టీ ముస్లిం సంచార జాతుల విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా సయ్యద్ షాకీర్‌బాబాను నియమించామని పేర్కొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో 10న జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల పదిన నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్, ముత్తూట్ ఫైనాన్స్, కాంటినెంటల్ కాఫీ, అమరరాజా బ్యాటరీస్ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు జాబ్‌మేళాను నిర్వహించనున్నామని, విద్యార్హత తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 86398 67407, 79896 13024 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు

ఉదయగిరి: వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు చేపడతామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల దుకాణ యజమానులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనలను పాటిస్తూ దుకాణాల వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఏడీఏ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా రాజేంద్రకుమార్ బాధ్యతలను గురువారం స్వీకరించారు. అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

వరద బాధితులకు రూ.ఐదు లక్షల విరాళం

నెల్లూరు(బృందావనం): విజయవాడలోని వరద బాధితులకు నెల్లూరు డిస్ట్రిక్ట్ బులియన్, డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ చేయూతనందించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శాంతిలాల్ జైన్ మాట్లాడారు. తమ వంతుగా రూ.ఐదు లక్షల విరాళాన్ని నెల్లూరు జీఎస్టీ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రత్యూషకు చెక్కు రూపంలో నర్తకి సెంటర్‌లోని వారి కార్యాలయంలో గురువారం అందజేశామని చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్మాట్ శ్రీనివాసులు, కోశాధికారి జై లాస్‌జైన్, సహాయ కార్యదర్శి లీలాధర్‌రెడ్డి, సలహాదారులు ఆంజనేయులు, సత్యనారాయణ, అలిమేలి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్ రైటర్‌పై దాడికి యత్నించిన హెడ్ కానిస్టేబుల్ విధుల నుంచి సస్పెండయ్యారు. వివరాలు.. కలువాయి స్టేషన్లో రైటర్‌గా రమణయ్య, హెడ్‌కానిస్టేబుల్‌గా జేమ్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. మద్యం మత్తులో జేమ్స్ బుధవారం తనకే డ్యూటీలు వేస్తావా అంటూ రైటర్‌పై దాడికి యత్నించారు. దీంతో రమణయ్య ఫిర్యాదు మేరకు రాపూరు సీఐ విజయకృష్ణ, కలువాయి ఎస్సై సుమన్ విచారణ చేశారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా జేమ్స్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా.. అవినీతికి పాల్పడినా.. క్రమశిక్షణ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షోభ హాస్టళ్లలో.. పాపం పసివాళ్లు..



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు సం'క్షోభ'ంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో కనీస వసతులు ఉండటం లేదు. గత ప్రభుత్వంలో వసతి విద్యార్థుల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు తీర్చేది. ప్రధానంగా అప్పట్లో మధ్యాహ్నం పాఠశాలల్లో నాణ్యమైన భోజనం ఉండేది. ఇక హాస్టళ్లలో ఉదయం అల్పాహారం, రాత్రి భోజన మెనూ కచ్చితంగా అమలయ్యేలా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్‌ను నియమించి పాఠశాలల నుంచి హాస్టళ్ల వరకు తరచూ తనిఖీ చేయించి మెనూ ప్రకారం భోజనం అందించేలా చూసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం కరువైంది. కేవలం రాత్రి పూట నీళ్ల సాంబార్‌తోనే సరిపెడుతున్న పరిస్థితి. మరుగుదొడ్ల నిర్వహణను గాలికొదిలేశారు. తాగే నీళ్లు, స్నానాలు చేసే నీళ్ల ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చకపోవడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. అపరిశుభ్రత వాతావరణంలోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

గిరిజన గురుకులంలో విద్యార్థుల కష్టాలు



నెల్లూరు ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో విద్యార్థులే వంట సహాయకులు

నెల్లూరు దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. భోజనం అనంతరం ఆ వంట పాత్రలను వాళ్లే మోస్తున్నారు. విద్యార్థుల వసతి గదిలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉంది. 162 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ప్రత్యేకంగా తరగతి గదుల్లేవు. రోజూ పెట్టెలను సర్దుకోవడం, అక్కడే తరగతులనూ నిర్వహిస్తున్నారు. భోజనాల సమయంలో బయట విద్యార్థులు చేస్తున్నారు.

వసతులు దుర్భరం.. భోజనం అధ్వానం



కావలిలోని బీసీ విద్యార్థుల హాస్టల్లో విరిగిపోయిన స్నానాల గది తలుపు

కావలి పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 11 హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1100 మంది విద్యార్థులు ఉన్నారు. ఎస్టీ గురుకుల హాస్టల్లో స్నానాలకు వాడే నీరు బాగా లేకపోవడంతో విద్యార్థులకు చర్మవ్యాధులు వస్తున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ హాస్టల్లో భోజనాలు బాగుండటంలేదని తల్లిదండ్రులకు విద్యార్థులు చెప్తున్నారు. దీంతో తరచూ భోజనాలను ఇంట్లో వండుకొని హాస్టల్‌కు తీసుకొచ్చి తమ బిడ్డలకు తినిపిస్తున్నారు. ఎస్సీ హాస్టల్లో స్నానాల గదుల తలుపు చెదలు పట్టి శిథిలమయ్యాయి. బీసీ హాస్టల్లో స్నానాల గదుల తలుపులు దారుణంగా మారాయి. నీటి ట్యాంకులు దుర్భర స్థితికి చేరాయి.

250 మందికి నాలుగే బాత్ రూములు



ఆత్మకూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో బాత్ రూమ్ వరండాల్లో స్నానం చేస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పట్టణంలో 19 హాస్టళ్లు, నాలుగు గురుకుల, రెండు మోడల్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కొన్నింటిలో పరిస్థితులు అధ్వానంగా మారాయి. పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో 250 మంది విద్యార్థులు స్నానాలు చేసేందుకు నాలుగే బాత్‌రూములే ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆరుబయట, బాత్ రూమ్ వరండాల్లో స్నానాలు చేయాల్సిన పరిస్థితి. ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. చేజర్ల బాలుర హాస్టల్లో బాత్‌రూముల్లో నీళ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూములకు సైతం తలుపుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.



- జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో దయనీయ పరిస్థితి
- విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలవుతున్నా.. ఇదే తీరు
- మెనూ అమలు లోపభూయిష్టం
- డైట్ చార్జీలివ్వక నీళ్ల సాంబారే దిక్కు
- గురుకులాలకు నాలుగు నెలలుగా నిత్యావసర వస్తువుల నిధుల నిలిపివేత
- సరఫరాను నిలిపేస్తామంటున్న వెండార్లు
- ఇదే జరిగితే ఆకలి కేకలే

సాక్షి ప్రతినిధి, నెల్లూరు / సాక్షి నెట్‌వర్క్ : విద్యార్థులకు మంచి విద్య, భోజనం, వసతిని సమకూర్చి.. సుశిక్షితులైన అధ్యాపకులను ఏర్పాటు చేసి.. మంచి విద్యనందించేలా గురుకుల పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలోని 28 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులున్నారు. ఇందులో బీసీ గురుకులాలు నాలుగు, ఎస్సీ గురుకుల పాఠశాలలు 15, ఎస్టీ గురుకుల పాఠశాలలు మూడు, జనరల్ ఆరు ఉన్నాయి. వీటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం నిష్పత్తితో నిధులను వెచ్చిస్తాయి.

అన్నింటికీ కోత..

పేద విద్యార్థులపై టీడీపీ ప్రభుత్వం మానవత్వాన్ని చూపడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డైట్ చార్జీలను నిలిపేసింది. నెలవారీ ఇచ్చే కాస్మొటిక్ చార్జీల పరిస్థితీ ఇంతే. గ్యాస్‌కు నిధుల్లేక గురుకులాల ప్రిన్సిపల్స్ అప్పులతో నెట్టుకొచ్చి పేద విద్యార్థుల కడుపులు నింపుతున్నారు. డైట్ చార్జీలను నిలిపేయడంతో హాస్టళ్లలో విద్యార్థులకు పెట్టే మెనూ పూర్తిగా మారిపోయింది. ఉడకని అన్నం, నీళ్ల చారుతోనే సరిపెడుతున్నారు. ఫలితంగా విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. మరికొందరు బయటి ఆహారాన్ని తింటున్నారు.

సంగంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 635 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నిత్యావసర సరుకులకు నిధులను ఐదు నెలలుగా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీనికి ప్రతి నెలా రూ.2.5 లక్షల వరకు అవసరం ఉంటుంది. దీంతో సరుకులను వెండార్ పూర్తి స్థాయిలో పంపడం లేదు. అరకొరగా పంపుతుండటంతో మెనూ ప్రకారం భోజనం అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వంటగ్యాస్‌కు నెలకు రూ.45 వేల వరకు ఖర్చవుతుంది. నిధుల్లేక ప్రిన్సిపల్స్ అప్పు చేసి కొనుగోలు చేస్తున్నారు. మరో నెల్లో నిధులు విడుదల కాకపోతే సరుకులను నిలిపేస్తామని వెండర్ చెప్తున్నారు. అదే జరిగితే విద్యార్థులకు ఆకలి కేకలు తప్పవు.



పొదలకూరులో నిద్రించే హాల్లోనే చదువుకుంటున్న విద్యార్థులు

జిల్లాలో హాస్టళ్లు

ఎస్సీ	బీసీ	ఎస్టీ
71	63	12
బాలురు 45	బాలికలు 17	బాలురు 4
బాలికలు 26	బాలురు 46	బాలికలు 8
విద్యార్థుల సంఖ్య		
4,500	5,569	2,310

కాస్మొటిక్ చార్జీ నెలకు

ఒక్కో విద్యార్థికి రూ.200

డైట్ చార్జీలు

3 - 4 తరగతి విద్యార్థులకు	రూ.1150
5 - 10 తరగతి విద్యార్థులకు	రూ.1,400
ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు	రూ.1,600

నో మెనూ.. పెట్టిందే తిను..!

కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 22 హాస్టళ్లు ఉండగా, ఎస్సీ పది, బీసీ పది, ఎస్టీ రెండు ఉన్నాయి. ఇందులో కందుకూరులో 10, లింగసముద్రంలో మూడు, వలేటివారిపాలెంలో ఒకటి, గుడ్లూరులో రెండు, ఉలవపాడులో ఆరు.. ఐదు కేజీబీవీలు, ఒక గురుకుల పాఠశాల ఉన్నాయి. కందుకూరు ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. నూతన భవన నిర్మాణానికి అనుమతి వచ్చినా, ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. విద్యా సంవత్సర ప్రారంభంలోనే వసతి విద్యార్థులకు అందించాల్సిన దుప్పట్లు, పెట్టెలను ఇంత వరకు ఇవ్వలేదు. ఉలవపాడు ఎస్సీ బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. మెనూ పాటించకుండా పప్పు మాత్రమే విద్యార్థులకు పెట్టారు. లింగసముద్రం ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లలో మరుగుదొడ్లు లేకపోవడంతో డబ్బాలు తీసుకొని పొలాల్లోకి వెళ్తున్న పరిస్థితి. ఉడకని అన్నం, రుచిలేని కూరలను తినలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. మంచినీరు కూడా సక్రమంగా ఉండవన్నారు. కళాశాల స్థాయి విద్యార్థులకు ఇచ్చే రూ.1600 మెస్ చార్జీలతో ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సి ఉంది. అయితే ఈ ఏడాది నుంచి డైట్ చార్జీలు విడుదల కాకపోవడంతో టీఆర్ఆర్ ఎస్సీ బాలికల కళాశాలల విద్యార్థులకు సాంబార్‌తోనే అన్నం పెడుతున్న పరిస్థితి.



కందుకూరులోని ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్లో సాంబార్ అన్నమే దిక్కు

సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు మొత్తం 18 ఉన్నాయి. వెంకటాచలం మండలం చెముడుగుంట, సర్వేపల్లి హాస్టళ్లలో విద్యార్థులు చేరకపోవడంతో వాటిని మూసేశారు. పొదలకూరు మండలంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు 8 ఉండగా, పొదలకూరు ఎస్సీ బాలికల హాస్టల్‌కు సొంత భవనం లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ముత్యాదాపురంలో దొడ్ల డెయిరీ సీఎస్సార్ ఫండ్స్‌తో హాస్టల్ భవనాలను చక్కగా నిర్మించారు. మనుబోలు మండలం మనుబోలులో ఎస్సీ బాలుర, బాలికల, బద్దెవోలులో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బాలికల వసతిగృహంలో తలుపు లేని స్నానపు గదులు, పెచ్చులూడుతున్న స్లాబ్‌తో విద్యార్థినులు భీతిల్లుతున్నారు. ముత్తుకూరులో సంక్షేమ వసతిగృహం ఉండగా తొలగించారు. తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు గ్రామాల్లో మొత్తం 4 హాస్టళ్లు ఉన్నాయి. నరుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహం నాలుగు దశాబ్దాల కాలం నాటిది కావడంతో పెచ్చులూడుతోంది. శిథిల భవనం కావడంతో ఎప్పుడేమి జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్ల సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. పొదలకూరులోని ఎస్సీ బాలికల వసతి గృహానికి సొంత భవనమే లేదు. ఒకే హాల్.. అదే స్టడీ రూమ్.. వసతి గది. ఇక్కడ 70 మందికి కలిపి ఐదు మరుగుదొడ్లే ఉన్నాయి. ఆరుబయటే దుస్తులను ఉతుక్కోవాలి.

ఆరుబయటే ఆడపిల్లల స్నానాలు

కోవూరులోని బీసీ బాలికల వసతి గృహంలో వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వాస్తవానికి ఇక్కడ 100 మందికే వసతి సరిపోతుంది. అయితే ప్రస్తుతం 140 మంది విద్యార్థినులున్నారు. స్నానాల గదులు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినులు ఆరుబయటే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 3, 4, 5వ తరగతి పిల్లలు బాత్ రూముల్లోనే స్నానం చేస్తున్నారు. ఇక బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్వహణ సక్రమంగా లేదు. ఇక్కడ 175 మంది విద్యార్థులుంటే.. వసతి మాత్రం 100 మందికే సరిపడేలా ఉంది. అత్యవసరమైన మెడికల్ కిట్లూ లేవు. మంచినీటికి ప్రత్యేకంగా డ్రమ్ములను ఏర్పాటు చేయలేదు. దాహమేస్తే కుళాయి వద్దకెళ్లి పట్టుకోవాలి. పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో విషపురుగు కుట్టి ఇటీవల ఓ విద్యార్థికి ఏకంగా కాలు తీసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



కోవూరు బీసీ వసతిగృహ విద్యార్థులు స్నానం చేసేది ఇక్కడే

ఆశలు ఆవిరై.. కన్నీళ్లే మిగిలి

ఉన్నంతలో సంతోషంగా ఉండే ఆ కుటుంబంపై విధి కక్షగట్టింది. పెద్ద కుమార్తె భర్త మృతి చెందడం.. మరో కుమార్తె మానసిక వైకల్యంతో బాధపడుతుండటం వారిని వేదనకు గురిచేస్తోంది. ఇది చాలదన్నట్లు మరో వారం రోజుల్లో తనకు పుట్టబోయే బిడ్డను కళ్లారా చూడాలనే ఆనందంతో ఇంటికొచ్చిన కుమారుడ్ని రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ వరుస పరిణామాలు ఆ కుటుంబానికి అశనిపాతంలా పరిణమించాయి. అసలే రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి.. ఆపై పోషణ భారంగా మారడంతో ఆపన్నహస్తం కోసం వారు ఎదురుచూస్తున్నారు.

పేద కుటుంబంపై కక్షగట్టిన విధి

- కుమారుడ్ని కబళించిన రోడ్డు ప్రమాదం
- తల్లిదండ్రులు, తోబుట్టువులకు పెద్ద దిక్కు
- గుండెలవిసేలా రోదిస్తున్న భార్య
- పోషణ సాగక దయనీయ స్థితి

వింజమూరు(ఉదయగిరి): విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం సమిధలైంది. వృద్ధాప్యంలో ఉన్న తమకు కుమారుడు బాసటగా ఉంటాడనే తల్లిదండ్రుల ధీమా.. భర్తను కోల్పోయి.. మానసిక వైకల్యంతో బాధపడుతున్న తమకు సోదరుడు ఉన్నాడనే తోబుట్టువుల ధైర్యాన్ని రోడ్డు ప్రమాదం చెరిపేసింది. ఘటనతో నిండు చూలాలైన భార్య గుండెలు పగిలేలా రోదిస్తుండగా.. నాన్న.. నాన్న అంటూ నాలుగేళ్ల చిన్నారి పడుతున్న ఆవేదన చూపరులను కలిచి వేస్తోంది.

భార్య ప్రసవానికి వచ్చి..

వింజమూరు మండలం గుండెమడుగులకు చెందిన వేములపాటి పెదమాలకొండయ్యకు ముగ్గురు పిల్లలు. ఈయన పెద్ద కుమార్తె భర్త అనారోగ్యంతో మరణించారు. తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటున్నారు. మరో కుమార్తె మానసిక దివ్యాంగురాలు. ఈమెకు పింఛన్ సైతం మంజూరు కాలేదు. కుమారుడు మహేష్‌కు పెద్ద కూతురి కుమార్తె శిరీషతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడున్నారు. ఈ కుటుంబం మొత్తానికి మహేషే ఆధారం. ఈ క్రమంలో చదువు మానేసి కుటుంబపోషణ నిమిత్తం చిన్నతనం నుంచే బేల్దారి పనులు చేసేవారు. పనుల కోసం కొద్ది నెలల క్రితం హైదరాబాద్ వెళ్లిన ఈయన భార్య ప్రసవం కోసం గత నెల 20న ఇంటికొచ్చారు.



ఒంటరైన భార్య, బిడ్డ

కబళించిన రోడ్డు ప్రమాదం

ఖాళీగా ఉంటే కుటుంబం గడిచే పరిస్థితి లేకపోవడంతో శంఖవరం సమీపంలోని యర్రబల్లికి డెకరేషన్ పనుల నిమిత్తం బైక్‌పై గత నెల 28న వెళ్లారు. ఈ తరుణంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. అందొచ్చిన కుమారుడు మరణించడం ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఆధారంగా ఉన్న వ్యక్తి అనంతలోకాలకు వెళ్లడంతో ఏమి చేయాలో పాలుపోక కుటుంబం విలవిల్లాడుతోంది. సరైన గూడు.. కూడు లేని ఆ కుటుంబం దాతల సాయం కోసం నిరీక్షిస్తోంది. వీరి దయనీయ స్థితిపై ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడంలేదు. వదాన్యులు వీరికి ఆపన్నహస్తం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పూరిపాక

సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

- కలెక్టర్ ఆనంద్
- ఘనంగా గురుపూజోత్సవం

నెల్లూరు(దర్గామిట్ట): సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేరళలోని చిన్న గ్రామంలో చదువుకున్నానని, తన తల్లి ఉపాధ్యాయురాలు అని.. పాఠశాలలోని ఉపాధ్యాయుల సూచన మేరకు ఐఏఎస్ సాధించానని చెప్పారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 60 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, ఇందులో జిల్లా స్థానం దక్కించుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. ఎస్టీ పిల్లల విద్యాభివృద్ధి, భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 60 మందిని ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ పొట్లూరి స్రవంతి, డీఈఓ రామారావు, ఏపీసీ ఉషారాణి, వయోజన విద్య డీడీ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.